

షేక్‌పేటలో మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి ప్రచారం చేస్తున్న భోలక్‌పూర్ నేతలు బింగి నవీన్, వై. శ్రీనివాస్‌రావు

## బీఆర్ఎస్‌కు అన్నివర్గాల ప్రజల మద్దతు

● మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్

ముషీరాబాద్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో అన్నివర్గాల ప్రజల మద్దతు బీఆర్ఎస్‌కే లభిస్తున్నదని మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం భోలక్‌పూర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు మాగంటి సునీతకు మద్దతుగా ప్రచారం చేసేందుకు తరలివెళ్లారు. ఈసందర్భం గా మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచు తూ బీఆర్ఎస్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టాక ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆరోపించారు. అందువల్లే ప్రజలు బీఆర్ఎస్‌ను బలపర్చుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నా రు. రాష్ట్ర మంత్రులు ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలను ప్రలోభపెట్టినా వారు నమ్మేస్థితిలో లేరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ భోలక్‌పూర్ డివిజన్ సీనియర్ నాయకుడు బింగి నవీన్, డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, మాజీ అధ్యక్షుడు మహ్మద్‌అలీ, ఉపాధ్యక్షుడు చాంద్, డివిజన్ బీసీ సెల్ అధ్యక్షుడు ఉమాకాంత్ పాల్గొన్నారు.



జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతు తెలుపుతూ కేటీఆర్‌ను కలిసిన జంటనగరాల మహేంద్ర సంఘం అధ్యక్షుడు రేషం మల్లేష్ తదితరులు

## జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్‌కు మహేంద్ర సంఘం మద్దతు

రాంనగర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్‌కు జంటనగరాల మహేంద్ర సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. శుక్రవారం జంటనగరాల మహేంద్ర సంఘం అధ్యక్షుడు రేషం మల్లేష్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను తెలంగాణ భవన్‌లో కలిసి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా రేషం మల్లేష్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో మహేంద్ర కులస్థుల అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు మద్దతుగా జంట నగరాల మహేంద్ర సంఘం తరపున తాము ఇంటింటి ప్రచారం చేస్తున్నామన్నారు. మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ అభ్యర్థికి జంట నగరాల మహేంద్ర సంఘం మద్దతు ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మహేంద్ర సంఘం నాయకులు గురుమూర్తి రామ్‌కుమార్, నర్సింగ్‌రావు, సతీష్, ప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతను గెలిపించాలి

చిక్కడపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతను గెలిపించాలని కోరుతూ శుక్రవారం గాంధీనగర్ డివిజన్ బీసీ సెల్ అధ్యక్షుడు గడ్డమీది శ్రీనివాస్‌తో పాటు పార్టీ నేతలు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని పలువురు మహిళా ఓటర్లను కోరారు. జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలన్నారు. ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, ముఠా నరేష్, పోతుల శ్రీకాంత్, బత్తుల కిరణ్‌కుమార్, అరుణశ్రీ, స్వరూప, వనజ పాల్గొన్నారు.



బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం చేస్తున్న శ్రీనివాస్ తదితరులు

## జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ విజయం ఖాయం

ముషీరాబాద్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధించడం ఖాయమని ముషీరాబాద్ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి వంగాల నర్సింగ్‌రావు అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతతో కలిసి వంగాల నర్సింగ్‌రావు ప్రచారం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతోనే బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని అన్నారు. అన్ని ప్రాంతాల ప్రజలు బీఆర్ఎస్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దీన్‌దయాల్‌రెడ్డి, ఆబేద్, జబ్బార్ పాల్గొన్నారు.



మాగంటి సునీతతో కలిసి ప్రచారం చేస్తున్న వంగాల నర్సింగ్‌రావు తదితరులు



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు జమాల్‌పురి నందు, బిజ్జి రవి

## జూబ్లీహిల్స్‌లో బీజేపీకి ప్రజల మద్దతు

ముషీరాబాద్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో ప్రజల మద్దతు బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డికే లభిస్తున్నదని ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం దీపక్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటికీ వెళ్లి ఆ పార్టీ నాయకులు ప్రచారం చేశారు. ఈసందర్భంగా జమాల్‌పురి నందు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల వల్లే దేశంలో ఎన్నికలు ఎక్కడ జరిగినా బీజేపీ ఘన విజయం సాధిస్తున్నదని అన్నారు. జూబ్లీహిల్స్‌లో సైతం పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు బిజ్జి రవి, నాయకులు కృష్ణాచారి, రమేష్, శ్రీధర్ పాల్గొన్నారు.

## బాలరత్న అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

చిక్కడపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కమలాకర మెమోరియల్ ట్రస్ట్, కమలాకర సంగీత, నృత్యకళాక్షేత్రం ఆధ్వర్యంలో జవహర్‌లాల్‌నెహ్రూ జయంతిని పురస్కరించుకుని బాలరత్న అవార్డులను ప్రదానం చేస్తున్నామని ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు భారతి కమలాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రంగాల్లో నిపుణులైన చిన్నారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఈనెల 18న జరుగనున్న అవార్డుల ప్రదానోత్సవానికి ఈనెల 10వ తేదీ లోగా 15 సంవత్సరాలలోపు వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 76759 55208 మొబైల్ నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## రైలులో ప్రయాణికురాలి బ్యాగు చోరీ

బర్కత్‌పుర : రైలులో ప్రయాణికురాలి హ్యాండ్ బ్యాగు చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ కేసు నమోదు చేశారు. బేగంపేట ప్రాంతానికి చెందిన మహిళ పాంచుర్య(64) కాచిగూడకు రావడానికి అజ్మీర్‌లో భగతికోటి ఎక్స్‌ప్రెస్ రైలులో ఎక్కింది. బ్యాగు సీట్‌లో పెట్టి బాత్‌రూమ్‌కు వెళ్లి వచ్చే సరికి బ్యాగు చోరీకి గురైంది. బ్యాగులో రెండు ఐ సెల్‌ఫోన్‌లు, రూ. 24,300 నగదు ఉంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ చేసి తదుపరి విచారణ నిమిత్తం అజ్మీర్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేశారు.



విద్యార్థులతో కలిసి వందేమాతర గేయాన్ని ఆలపిస్తున్న ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణి, ఉపాధ్యాయులు



చిక్కడపల్లి సిటీసెంట్రల్‌లైబ్రరీలో వందేమాతరం గేయాన్ని ఆలపిస్తున్న కార్యదర్శి పద్మజ, నిరుద్యోగులు



విద్యానగర్‌లోని స్వామి వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వందేమాతర గేయాన్ని ఆలపిస్తున్న విద్యార్థులు, ప్రిన్సిపాల్ కె.ప్రభు తదితరులు

# ఘనంగా వందేమాతరం వేడుకలు

రాంనగర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : విద్యానగర్‌లోని స్వామి వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం వందేమాతరం 150 ఏళ్ల వేడుక జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు వందేమాతర గేయాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.ప్రభు పాల్గొని మాట్లాడుతూ 150 ఏళ్ల క్రితం నవలా రచయిత బంకించంద్ర చటోపాధ్యాయ వందేమాతర గీతాన్ని రచించారని తెలిపారు. ఆనంద్‌మట్ అనే నవలలో 1982లో ఈ గీతం రచించబడిందన్నారు. 1905 ఆగస్టు 7న వందేమాతరంను స్వాతంత్ర్య నినాదంగా ఉపయోగించుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఆర్.లావణ్య, డాక్టర్ అనురాధ, కో-ఆర్డినేటర్ డాక్టర్ ఓ.పద్మజ తదితరులు పాల్గొన్నారు.

### నల్లకుంట ప్రభుత్వ పాఠశాలలో..

అడిక్‌మెట్‌లోని నల్లకుంట ప్రభుత్వ పాఠశాలలో వందేమాతరం 150ఏళ్ల వేడుకలు ఘనంగా జరిగాయి. ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి, ప్రధానోపాధ్యాయులు ముత్యాల రవీందర్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు వందేమాతరం గీతాలాన చేశారు. వందేమాతరం గీత ప్రాధాన్యతను ఆయన విద్యార్థులకు వివరించారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భవానీ, ఉపాధ్యాయులు నాగమణి, భాగ్యలక్ష్మి, అనిల్‌కుమార్, నీరజ, సంధ్యారాణి, అనిత, శివకళ తదితరులు పాల్గొన్నారు.

### ముషీరాబాద్ విద్యామండలి పరిధిలో..

ముషీరాబాద్ : వందేమాతర గీతం ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుందని ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణి అన్నారు. వందేమాతర గీతం 150 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ముషీరాబాద్ విద్యామండలి పరిధిలోని 7ఉన్నత పాఠశాలలు, 22 ప్రాథమిక పాఠశాలల్లో ఉదయం ఉపాధ్యాయులు, విద్యార్థులు సామూహిక వందేమాతర గీతాలాపన చేశారు. ఈసందర్భంగా స్వరూపారాణి మాట్లాడుతూ వందేమాతరగీతం వెలువడి 150సంవత్సరాలు అయినందున ప్రతి పాఠశాలలో ఉత్సవాలు నిర్వహిస్తున్నాం అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రతిధ్వనించిన దేశభక్తి గీతం ప్రజల్లో చైతన్యాన్ని నింపిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



నల్లకుంట ప్రభుత్వ పాఠశాలలో వందేమాతర గేయాన్ని ఆలపిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



బాలోత్సవం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో వందేమాతర గేయాన్ని ఆలపిస్తున్న విద్యార్థులు

### చిక్కడపల్లి సిటీసెంట్రల్ లైబ్రరీలో..

చిక్కడపల్లి : వందేమాతరం గేయానికి 150ఏళ్లు పూర్తైన సందర్భంగా కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల సూచన మేరకు శుక్రవారం చిక్కడపల్లి సిటీసెంట్రల్ లైబ్రరీలో నిరుద్యోగ యువతీయువకులతో కలిసి లైబ్రరీ కార్యదర్శి పొట్లూరు పద్మజ, లైబ్రేరియన్ స్టాఫ్ చంద్రకళ తదితరులు గీతాన్ని ఆలపించి మాట్లాడారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో బంకించంద్ర చటర్జీ రాసిన వందేమాతరం గేయం సామాన్యులను సైతం కదిలించి స్వాతంత్ర్యం వచ్చేవిధంగా తోడ్పడిందన్నారు. ఆంగ్లేయులను దేశం నుంచి తరిమికొట్టేందుకు స్వదేశీ ఉద్యమానికి ఈ గేయం ఒక స్ఫూర్తి అన్నారు. అందరిని ఏకతాటిపై తీసుకువచ్చిన ఘనత వందేమాతరం గేయానిదన్నారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ నేతలు కయ్య వెంకటేష్, శంకర్‌నాయక్, బాలకోటి, సంపత్, రవి, సలీమ్, రమేష్, మధు, కృష్ణ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బర్కత్‌పుర : వందేమాతరం గీతానికి 150 ఏళ్లు నిండిన సందర్భంగా కాచిగూడ రైల్వేస్టేషన్ ఆవరణలో శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు. రైల్వే అధికారులు, సిబ్బంది వందేమాతరం గేయాన్ని ఆలపించి బంకింగ్ చంద్ర చటర్జీకి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ డైరెక్టర్ ఎస్.నాగేశ్వరరావు, స్టేషన్ మాస్టర్ అనిల్, ఆర్‌పీఎఫ్ సీఐ గోరక్‌మాల్, ఏఎస్ఐ శిరీష పాల్గొన్నారు.

బర్కత్‌పుర : కాచిగూడ చప్పల్‌బజార్‌లోని సెయింట్ మీరా పాఠశాలలో వందేమాతరం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులచే వందేమాతరం గేయాన్ని ఆలపింపచేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్, పాఠశాల ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేట : వందేమాతరం గీతం రచించి 150 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు అంబర్‌పేట హైమావతి ఉన్నత పాఠశాలలో విద్యార్థులు శుక్రవారం వందేమాతరం గీతం ఆలపించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నిరంజన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కబ్జాదారులకు కొమ్ము కాస్తున్న కేటీఆర్

● ప్రభుత్వ భూములను పరిరక్షిస్తున్న హైడ్రాను కేటీఆర్ బద్నామ్ చేయడం తగదు : వి. హనుమంతరావు

రాంనగర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కబ్జాదారుల కొమ్ము కాస్తున్నారని మాజీ ఎంపీ వి.హనుమంతరావు ఆరోపించారు. ప్రభుత్వ భూములను పరిరక్షిస్తున్న హైడ్రాను కేటీఆర్ బద్నామ్ చేయడం తగదన్నారు. బతుకమ్మకుంట స్థలాన్ని అంబర్‌పేట బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి కబ్జా చేస్తే పోరాడి చెరువును పునరుద్ధరించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. శుక్రవారం బాగ్అంబర్‌పేటలోని బతుకమ్మకుంటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీహెచ్ మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ భూముల పరిరక్షణ, విపత్తుల సమయంలో ప్రజలను ఆదుకోవాలనే లక్ష్యంతో హైడ్రాను ఏర్పాటు చేశారని తెలిపారు. అయితే హైడ్రా వల్ల వేల ఎకరాల ప్రభుత్వ భూములను కబ్జాదారుల నుంచి పరిరక్షించుకోవడం జరిగిందన్నారు. అందులో భాగంగా అంబర్‌పేట నియోజకవర్గంలోని బతుకమ్మకుంట స్థలాన్ని బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి కబ్జా చేస్తే తాను పోరాటం చేసి ఆ స్థలాన్ని పరిరక్షించి రూ. 8కోట్లతో బతుకమ్మకుంట చెరువును పునరుద్ధరించామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా వేల ఎకరాలను బీఆర్ఎస్ నేతలు కబ్జాలు చేశారని ఆరోపించారు. కబ్జాదారులందరికీ కేటీఆర్ మున్సిపల్ శాఖ మంత్రిగా ఉండి వారికి మద్దతు పలికారని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు కబ్జా చేసిన ప్రభుత్వ భూములను హైడ్రా ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావడంతో తమ పార్టీ నేతలకు నష్టం జరుగుతుందనే హైడ్రాను తీసివేయాలని డిమాండ్ చేస్తున్నారని అన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కూడా హైడ్రా గురించి మాట్లాడి ప్రజలను తప్పుదోవ పట్టించి ఓట్లు దండుకోవాలని కేటీఆర్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కేటీఆర్ ఎన్ని ఎత్తులు వేసినా ఓట్లకు ఎన్ని డబ్బులు పంపిణీ చేసినప్పటికీ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ విజయం సాధిస్తారని పేర్కొన్నారు. నవీన్‌యాదవ్‌ను కేటీఆర్ ఆకురౌడి అని అనడం తగదన్నారు. కేటీఆర్ ఇప్పటికైనా సీఎంపై, ప్రభుత్వంపై, హైడ్రాపై తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అంబర్‌పేటకు ఫ్లైఓవర్ తప్ప మరేమీ చేయలేదని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మహేందర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్, కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు దిడ్డి రాంబాబు, పుల్లా నారాయణస్వామి, నాయకులు మోతె రోహిత్, కృష్ణగౌడ్, గడ్డం శ్రీధర్‌గౌడ్, కోటం అనిల్, సుధాకర్, కిరణ్, రాజ్‌కిరణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ వి.హనుమంతరావు తదితరులు

# గ్రేటర్‌లో టీడీపీ పూర్వవైభవానికి కృషి చేయాలి

● టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు అరవింద్‌కుమార్‌గౌడ్

రాంనగర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : గ్రేటర్‌లో టీడీపీకి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు తెలుగుతమ్ముళ్లు కృషి చేయాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎం.అరవింద్‌కుమార్‌గౌడ్ సూచించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలకు సిద్ధం కావాలని సూచించారు. శుక్రవారం దోమలగూడలోని టీడీపీ నగర కార్యాలయంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు పి.సాయిబాబా అధ్యక్షతన ఖైరతాబాద్ నియోజకవర్గ టీడీపీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా పార్టీని నమ్ముకుని అంకితభావంతో పనిచేస్తున్న కార్యకర్తలకు పార్టీ అధిష్ఠానం తగిన గుర్తింపు కల్పిస్తుందన్నారు. పార్టీ సంస్థాగతంగా పదవులు లభిస్తాయని పేర్కొన్నారు. పార్టీ అధినేత చంద్రబాబునాయుడు నాయకత్వంలో తెలంగాణలో టీడీపీకి మంచి భవిష్యత్ ఉందన్నారు. గత వైభవం కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ప్రజా సమస్యలపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లెల కిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్, ఎం.నర్సింహ, బాలరాజు, గోస్వామి, ప్రదీప్‌గౌడ్, వంశీకృష్ణ, ఎం.డి.సలీం, శాస్త్రి, జ్ఞానేశ్వర్, శ్రీనివాస్, కిరణ్, అనిల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు అరవింద్‌కుమార్


# 16న స్ఫూర్తి బాలల ప్రతిభోత్సవం - 2025

నల్లకుంట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : చిన్నారుల్లో నిక్షిప్తమైన సృజనాత్మకమైన శక్తిని వెలికితీసి ప్రోత్సహించాలనే ఏకైక లక్ష్యంతో స్ఫూర్తి మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తుందని సంస్థ డైరెక్టర్ అండ్ కొరియోగ్రాఫర్ ఇ.సూర్యతేజసుబ్రాంత్ మాస్టర్ వెల్లడించారు. ఈ మేరకు వివిధ రంగాల్లో ప్రతిభావంతులైన వారి కోసం ఈనెల 14న బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్ఫూర్తి బాలల ప్రతిభోత్సవం - 2025 కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. శుక్రవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో విలేకరుల సమావేశంలో సంస్థ గౌరవ సలహాదారులు ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు కృష్ణాదిశేషు, నృత్యగురువు ప్రతిభారాజ్‌గౌడ్, సలహాదారులు లయన్ పవన్, కోటేశ్వరరావుతో కలిసి ఇ.సూర్యతేజసుబ్రాంత్ మాస్టర్ మాట్లాడారు. స్ఫూర్తి మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 16న సాయంత్రం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో స్ఫూర్తి బాలల ప్రతిభోత్సవం - 2025 నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రతిభోత్సవంలో బాలబాలికల్లో నిక్షిప్తమైన సంగీతం, మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్స్, నృత్యం, సోలో, డ్యూయేట్, డబుల్స్, మిమిక్రీ, మ్యాజిక్, ఏకపాత్రాభినయం, కరాటే వంటి వారిలోని ప్రతిభా పాటవాలను వెలికితీసి ప్రోత్సాహించాలనే ఏకైక లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

# కులరహిత సమాజానికి చయన్ నెట్‌వర్క్ కృషి

● 2014 నుంచి 2024 వరకు దేశంలోని పలు రాష్ట్రాల్లో చయన్ నెట్‌వర్క్ సదస్సులు

నల్లకుంట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : కులరహిత సమాజం కోసం దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన పలు 20కి పైగా సామాజిక సంస్థల(చయన్) నెట్‌వర్క్ 2012 నవంబర్ 24న ఢిల్లీలో ఆవిర్భవించిందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ముఖ్యంగా ప్రస్తుత సమాజంలో వివాహం ఎంపిక హక్కు(జీవిత భాగస్వామిని ఎంచుకునే హక్కు) కల్పించేందుకు ఈ సంస్థ కృషి చేస్తుందని వారన్నారు. శుక్రవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో విలేకరుల సమావేశంలో చయన్ నెట్‌వర్క్‌లోని కుల నిర్మూలన సంఘం, మానవ వికాస వేదిక, జనవిజ్ఞాన వేదిక, కులాంతర వివాహితుల సంక్షేమ సంఘం, మూఢనమ్మకాల నిర్మూలన సంస్థల ప్రతినిధులు టి.స్కైలాబ్‌బాబు, సూర్యనారాయణ, ఎం.డి.వాహీద్, ఎక్బాల్, స్వరాజ్యలక్ష్మి, ప్రభాకర్, ఈశ్వరలింగం, లక్ష్మి, సుబ్బారావు మాట్లాడారు. దేశంలో ఇప్పటి వరకు కులదురహంకార హత్యల్లో 140 పైగా జరిగాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కులంపై ఆధిపత్య ధోరణితో కులాంతర వివాహం చేసుకున్న వారిపై ఈ కులాలు దాడులు, హత్యలకు పాల్పడుతున్నాయని, ఇది దుర్మార్గమైన చర్య అని వారన్నారు. కులాంతర, మతాంతర వివాహంపై రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 హక్కు కల్పించిందని వారు గుర్తుచేశారు. 2014 నుంచి 2024 వరకు న్యూఢిల్లీ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో ఈ సదస్సులు జరిగాయని వారన్నారు. తెలంగాణలో ఈనెల 9న బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో కులాంతర వివాహాలకు ప్రత్యేక చట్టం తీసుకురావాలనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు వారన్నారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథులుగా రాష్ట్రమంత్రి సీతక్క, జస్టిస్ రజనీ, జస్టిస్ జి.రాధారాణి, జస్టిస్ చంద్రయ్య, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కన్వీనర్ విమలక్క తదితరులు హాజరవుతారని వారన్నారు.




చయన్ జాతీయ సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టి.స్కైలాబ్ బాబు, సూర్యనారాయణ, ఎం.డీ.వాహీద్, ఎక్బాల్, స్వరాజ్యలక్ష్మి

## జ్ఞానదీపాలుగా బాలోత్సవాలు

● పిల్లల మానసిక నిపుణుడు సుధీర్ సంద్ర

రాంనగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : బాలోత్సవాలు జ్ఞానవికాసదీపాలుగా వెలుగొందుతున్నాయని ప్రముఖ పిల్లల మానసిక నిపుణులు సుధీర్ సంద్ర పేర్కొన్నారు. శుక్రవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో జరిగిన తెలంగాణ బాలోత్సవం 5వ పిల్లల జాతర కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. బాలోత్సవం చిన్నారులలో కొత్త ఆశలను చిగురింపచేస్తుందన్నారు. జాతి భావితకైనా, భాష మనుగడకైనా పిల్లలు ఆశా దీపాలు అని పేర్కొన్నారు. పిల్లలను మార్కులతో కొలువలేమని అన్నారు. వార్షిక పరీక్షలతో జతకట్టలేమన్నారు. పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను బయటకు తీసేందుకు బాలోత్సవం వేడుకలు దోహదపడతాయని పేర్కొన్నారు. తెలంగాణ బాలోత్సవం కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు భూపతి వెంకటేశ్వర్లు, ఎన్.సోమయ్య మాట్లాడుతూ 5 సంవత్సరాలుగా ఈ ఉత్సవాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని అన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశామన్నారు.



సుధీర్ సంద్రకు జ్ఞాపిక అందజేస్తున్న నిర్వాహకులు భూపతి వెంకటేశ్వర్లు, సోమయ్య

## బీఆర్ఎస్ గెలుపునకు ఉద్యమకారులు కృషిచేయాలి

● పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్

కవాడిగూడ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వివరిస్తూ బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు తెలంగాణ ఉద్యమకారులు కృషిచేయాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్ సూచించారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లో జరిగే ఎన్నికల్లో భాగంగా మాజీ మంత్రి కేటీఆర్‌ను కవాడిగూడ డివిజన్ మాజీ ప్రధాన కార్యదర్శి, ఉద్యమకారుడు బల్లెకార్ రమేష్ కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ జూబ్లీహిల్స్‌లో జరిగే ఉప ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలను గతంలో బీఆర్ఎస్ అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కొంత మంది ఉద్యమకారులకు అన్యాయం జరిగిన మాట వాస్తవం అని రాబోయే రోజుల్లో ఉద్యమకారులను పార్టీ అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. ఇందు కోసం తెలంగాణ ఉద్యమకారులందరూ పార్టీ గెలుపు కోసం శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



కేటీఆర్‌ను కలిసిన ఉద్యమకారుడు బల్లెకార్ రమేష్

## లైబ్రరీ అన్నపూర్ణ క్యాంటీన్ భోజనంలో పురుగు

చిక్కడపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీ ఆవరణలో చదువుకుంటున్న పోటీపరీక్షల అభ్యర్థులు, నిరుద్యోగుల కోసం జీహెచ్ఎంసీ, హరేరామహరేకృష్ణ ట్రస్టు ఏర్పాటు చేసిన అన్నపూర్ణక్యాంటీన్‌లోని 5రూపాయల భోజనంలో శుక్రవారం బియ్యం పురుగు వచ్చింది. అప్పటికే కొందరు నిరుద్యోగులు ఈ భోజనాన్ని తిన్నారు. ఒక నిరుద్యోగి భోజనంలో బియ్యం పురుగు కనిపించడంతో నిరుద్యోగులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. నిరుద్యోగ జేఏసీ నేత జి కృష్ణ భోజనం విక్రయిస్తున్న వ్యక్తితో వాగ్వాదానికి దిగారు. అనంతరం 5రూపాయల భోజనం విక్రయాన్ని ఆపించి క్యాంటీన్‌ను మూసివేయించారు. ఇప్పటికి ఇది మూడోసారని గతంలో కూడా బొద్దింక, పురుగు వచ్చాయని తెలిపారు. ఇక్కడ చదువుకుంటూ 5రూపాయల భోజనం చేద్దామంటే పురుగుల భోజనం పెడుతున్నారని మండిపడ్డారు. ఇలాంటి సంఘటనలు ఇకముందు జరిగితే సహించేది లేదని హెచ్చరించారు.